RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 416 | 05 ఆదివారం జూలై 2026. | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు..

# జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం
- తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం
- ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్



ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం ఆయన పర్యటించారు.

సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు.

2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది


### : కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్



తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ. 10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు. పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## 20 ఏళ్ల కిందట తన చేతిలో ఓడిన ప్రత్యర్థికి కీలక పదవి..

### సీఎం రేవంత్ రెడ్డి హామీ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పూర్వ రాజకీయ ప్రత్యర్థికి కీలక హామీ ఇచ్చారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం జడ్పీటీసీ ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓటమిపాలైన మహమ్మద్ గౌస్ రబ్బానీకి ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పిస్తామని ఆయన ప్రకటించారు. తన తొలి రాజకీయ విజయానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో ముఖ్యమంత్రి పర్యటించారు. 2006 జులై 4న జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రబ్బానీపై రేవంత్ రెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రబ్బానీకి తగిన పదవిని గుర్తించి, బాధ్యతలు అప్పగించాలని అక్కడికక్కడే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశించారు. దీనితో పాటు తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన మిడ్జిల్ మండల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకున్న రేవంత్ రెడ్డి, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రబ్బానీని జడ్పీ ఛైర్మన్‌గా నియమించాలని భావించిందని పేర్కొన్నారు. గత 35 ఏళ్లుగా సింగిల్ విండో ఛైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి రబ్బానీ చేసిన సేవలు వృథా కావని ఆయన స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఉర్కొండపేటలోని పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మిడ్జిల్‌లో కల్వకుర్తి, నాగర్ కర్నూలు ప్రాంతాల్లో గుర్తింపు పొందిన నాయకుడు ద్యాప గోపాల్ రెడ్డి విగ్రహంతో పాటు, డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని

# అధిగమించాం

### : ప్రధాని మోదీ



పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

## ఏక్ నాథ్ షిండేకు అస్వస్థత..


### థానే ఆస్పత్రిలో చికిత్స



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అస్వస్థతకు గురయ్యారు. గత రెండు రోజులుగా స్వల్ప జ్వరం, తీవ్ర నీరసం, ఒళ్లునొప్పులతో ఆయన బాధపడుతున్నారు. వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు షిండేను థానేలోని జూపిటర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయనకు వివిధ వైద్య పరీక్షలు జరుగుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కొన్ని రోజులుగా వరుస రాజకీయ కార్యక్రమాలు, ఎన్నికల సన్నాహాలు, ప్రభుత్వ వ్యవహారాలు, విపరీతమైన పనిభారం కారణంగా షిండే ఆరోగ్యం దెబ్బతిన్నట్లు సమాచారం. ఆయన త్వరగా కోలుకోవాలని రాజకీయ నాయకులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తాడు

### : బండి భగీరథ్ కేసులో హైకోర్టుకు పోలీసులు



బండి సాయి భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయవద్దని తెలంగాణ పోలీసులు హైకోర్టును కోరారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోక్సో కేసులో ఈ మేరకు పోలీసులు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పోలీసులు తమ అఫిడవిట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. విజయవర్ధన్ జులై 3న దాఖలు చేసిన కౌంటర్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. 17 ఏళ్ల బాలికతో పరిచయం పెంచుకున్న భగీరథ్, ఆమెను లోబర్చుకుని 2025 నుంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శ్రీరామ్ గార్డెన్స్, నానక్‌రామ్‌గూడలోని గోల్ఫ్ ఎడ్జ్ అపార్ట్‌మెంట్స్‌లో ఈ ఘటనలు జరిగినట్లు తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న భగీరథ్, తాను నిర్దోషినని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను ఈ కేసులో ఇరికించారని ఆరోపిస్తూ రెగ్యులర్ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
# హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
05 ఆదివారం జూలై 2026.

## యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావాలి: బూర నర్సయ్య గౌడ్

### శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలే దేశ ప్రగతికి మార్గదర్శకం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సంస్మరణ పక్షం కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. దేశం ముక్కలు కాకుండా ఉండాలనే సంకల్పంతో ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండకుండా దేశ అభివృద్ధి, సమాజ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలను కేవలం చూసే వారిగా కాకుండా, వాటిని సానుకూల దిశగా ప్రభావితం చేసే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు.
శ్యామ ప్రసాద్ ముఖర్జీ నాటిన జాతీయవాద భావజాలమే నేడు దేశంలో బలమైన శక్తిగా ఎదిగిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ ఆశయాలు మరింత బలోపేతమవుతున్నాయని బూర నర్సయ్య గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం వైస్ చైర్మన్ శ్యామల, బీజేపీ నాయకులు, జిల్లా మహిళా మోర్చా ప్రతినిధులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్

### విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించిన పోలీసులు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
కొత్తపేట: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని కేశంపేట పోలీస్ స్టేషన్ సీఐ నరహరి సూచించారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన మాదకద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్రగ్స్, గంజాయి, కొకైన్ వంటి మాదక పదార్థాలు, అలాగే ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలు వ్యక్తిగత జీవితం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. అలాంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.
గురువులు బోధించే పాఠాలను శ్రద్ధగా అభ్యసిస్తూ ఉన్నత ఫలితాలు సాధించాలని, విద్యతో పాటు దేశభక్తి, నైతిక విలువలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సీఐ నరహరి పిలుపునిచ్చారు.కార్యక్రమం ముగిసిన అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సీఐ నరహరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ ఆసీఫ్, అధ్యాపకులు లక్ష్మీరాజ్, నారాయణ, నాగయ్య, మల్లేశ్, సదానంద గౌడ్, ధృవ్ కుమార్, సిబ్బంది శ్రీనివాస్, తిరుపతయ్యతో పాటు పోలీస్ సిబ్బంది శివకుమార్ రెడ్డి, శివుడు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి

### బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బూత్ స్థాయిలో పార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి సూచించారు. విలేకరులతో మాట్లాడుతూ, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులను కొత్త ఓటర్లుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. బూత్ లెవల్ అధికారులతో (బీూాలు) సమన్వయం చేసుకుంటూ పార్టీ బీఎల్ఏలు, ఏజెంట్లు, గ్రామ అధ్యక్షులు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, కొత్త ఓటర్ల వివరాల నమోదు, అవసరమైన పత్రాల ధ్రువీకరణలో ప్రజలకు సహకరించాలని సూచించారు.
ఓటరు జాబితాను పారదర్శకంగా, దోషరహితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అలాగే మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి వివరాలు, డూప్లికేట్ నమోదులకు సంబంధించిన లోపాలు గుర్తిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.
ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు, ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు



ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని బంటీ పిలుపునిచ్చారు.

## అర్హులు ఎవరు ఓటు హక్కును కోల్పోవద్దు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సిహెచ్ బాలకృష్ణ




హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 04:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అమీర్పేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ... గ్రామంలో బూత్ నెంబర్ 464 సర్ పక్రియలో భాగంగా బి ఎల్ ఓ అనిత తో కలిసి ఓటర్లకు ఎస్ఐఆర్ పత్రాలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా.. బాలకృష్ణ మాట్లాడుతూ.. ఇంటింటా తిరిగి ఓటర్ లిస్ట్ పత్రాన్ని ఏ విధంగా నింపాలో తెలియజేస్తూ పలు సూచనలు చేశారు. అనార్హులు ఏ ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు కాకుండా అర్హులంతా నమోదయ్యేలా అర్హులు ఎవరు తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా సర్ ప్రక్రియ దోహదపడుతుందన్నారు పత్రంను నింపిన తర్వాత బిఎల్వోలు ఇళ్లను సందర్శిస్తారని తెలిపారు రెండు వారాలలో బిఎల్వోలు ఒక ఫారాన్ని ఓటర్ల వద్ద ఉంచి మరో ఫారాన్ని సేకరిస్తారని ఆయన చెప్పారు. చందా ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఒక్కరూ విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు సిహెచ్ బాలకృష్ణ తెలియజేశారు

## వానాకాల సన్నద్ధతపై జిల్లా యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశాలు

### వ్యవసాయం-ప్రజారోగ్యంపై శాఖల సమన్వయానికి ప్రాధాన్యం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
రంగారెడ్డి జిల్లాలో వానాకాల సాగు, ప్రజారోగ్య పరిరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.వర్షాకాలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలు, యూరియా అక్రమ రవాణాపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. రైతు రిజిస్ట్రీలో అర్హులైన ప్రతి రైతు నమోదు పూర్తయ్యేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు.
ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య కార్యక్రమాలు, దోమల నివారణ చర్యలు, ఫాగింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాలను నాణ్యతతో అమలు చేయాలని, పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు జూలై నెల లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి, ప్రతి వారం పురోగతిని సమీక్షిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహేశ్వరం మండలం గంగారం గ్రామంలో "జల్ అర్బన్ దివస్" ఘనంగా నిర్వహించారు





హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 4
రంగారెడ్డి జిల్లామహేశ్వరం మండలం గంగారం గ్రామం లోజల జీవన్ మిషన్ లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మహేశ్వరం మండలం గంగారం గ్రామంలో శనివారం "జల్ అర్బన్ దివస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి మిషన్ భగీరథ ఏఈ రఘు ప్రారంభించారుఈ సందర్భంగా గ్రామంలోని నీటి ట్యాంక్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయ కొట్టి గ్రామ మహిళ చేత కలశం పట్టించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో "హర్ ఘర్ జల్ - జల్ జీవన్ మిషన్" పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం. నీటిని వృథా చేయవద్దని, వర్షపు నీటిని ఒడిసిపట్టాలని అధికారులు గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్, ఉప సర్పంచ్ మహేందర్ గ్రామ వార్డు సభ్యులు, ఆశా వర్కర్లు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలు జూలైలోపు పూర్తి చేయాలి


### లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ గృహాల పనులను వేగవంతం చేసి జూలై నెలాఖరులోపు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పీ. గౌతం అధికారులను ఆదేశించారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని మల్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న 1,548 ఇళ్లు, కుర్మల్‌గూడలోని 1,536 ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హులకే ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంతకుముందు రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవులపల్లి, లక్ష్మీగూడ ప్రాంతాలను కూడా ఆయన సందర్శించారు. లక్ష్మీగూడలోని రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీల్లో నివాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాంబే కాలనీలో నీటి కనెక్షన్లు ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా లేకపోవడంపై స్థానికులు ఫిర్యాదు చేయగా, వాటర్ వర్క్స్ అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



అలాగే హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ భూములను కూడా పరిశీలించారు. ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, జిల్లా పీడీ డి. చాంప్లా నాయక్, ఈఈ నర్సయ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
05 ఆదివారం జూలై 2026.







# కాచిగూడ కబేలాలో కనీస సౌకర్యాలు కల్పించండి

## ఎం బి టి పార్టీ స్పోక్స్ పర్సన్ ఆమ్జద్ ఉల్లాఖాన్






హైదరాబాద్, జూలై 04: మజ్లిస్ బచావో తెహ్రీక్ (వీదీ) పార్టీ అధికార ప్రతినిధి ఆమ్జద్ ఉల్లా ఖాన్ శనివారం అంబర్‌పేట్ మేకలు, గొర్రెల వధశాలను (కాచీగూడ కమేళా) సందర్శించి, కాచీగూడ వధశాల కమేళా సంఘం సభ్యులు, కమీషన్ ఏజెంట్లు (మొండేధార్లు), కసాయివాళ్లు, చిల్లర మాంసం వ్యాపారులు, మాంసపు వ్యర్థాల వ్యాపారులు మరియు తమ జీవనోపాధి కోసం ఈ వధశాలపై ఆధారపడిన కార్మికులతో సమావేశమయ్యారు.

ఈ పర్యటన సందర్భంగా, వధశాల ఆధునీకరణ తర్వాత వందలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరిస్తూ సంఘం ఒక వివరణాత్మక వినతిపత్రాన్ని సమర్పించింది. అంబర్‌పేట్ మేకలు, గొర్రెల వధశాల దాదాపు 75 సంవత్సరాల క్రితం మూసీ నది ఒడ్డున స్థాపించబడిందని, ఇది హైదరాబాద్ నగర మాంసం అవసరాలను తీరుస్తోందని సంబంధిత వర్గాలు ఆమ్జద్ ఉల్లాఖాన్ కు తెలియజేశాయి.

కటిక్, ఖురేషీ వర్గాలతో పాటు ఇతర ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన సభ్యులతో సహా సుమారు 1,000 మంది ప్రజలు తమ జీవనోపాధి కోసం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఈ వధశాలపై ఆధారపడి ఉన్నారని వారు తెలిపారు.

సంఘం ప్రకారం, ఆధునీకరణకు ముందు ఈ వధశాలలో పశువుల వ్యాపారం కోసం సంత, కమీషన్ ఏజెంట్ల కోసం దుకాణాలు, పార్కింగ్ స్థలం మరియు వ్యాపారం సజావుగా సాగడానికి అవసరమైన ఇతర మౌలిక సదుపాయాలతో సహా తగినన్ని సౌకర్యాలు ఉండేవి. అయితే, 2022లో ఆధునీకరణ ప్రాజెక్ట్ పూర్తయి, నిర్వహణ మరియు పర్యవేక్షణను ఒక ప్రైవేట్ కన్సార్టియమ్‌కు అప్పగించిన తర్వాత, గతంలో అందుబాటులో ఉన్న అనేక సౌకర్యాలను నిలిపివేశారని ఆరోపణలు వచ్చాయి. దీనివల్ల వ్యాపారులు, కార్మికులు మరియు చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సజీవ మేకలు మరియు గొర్రెల అమ్మకం, కొనుగోలు కోసం సరైన సంత ఏర్పాటు చేయకపోవడం వల్ల వ్యాపారులు మరియు కమీషన్ ఏజెంట్లు ఇబ్బందులు పడుతున్నారని వాటాదారులు ఆరోపించారు. వ్యాపార లైసెన్సులు జారీ చేయడానికి నిబంధనలు ఉన్నప్పటికీ, అర్హులైన మోండేధార్లకు అధికారులు లైసెన్సులు మంజూరు చేయలేదని వారు మరింతగా ఫిర్యాదు చేశారు.

ప్రైవేట్ ఆపరేటర్ మరియు దాని ప్రతినిధులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వధశాలపై ఆధారపడిన ప్రజలకు ఆటంకాలు కలిగిస్తూ, వారి జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారని కూడా సంఘం ఆరోపించింది. దేశీయ వినియోగం కోసం ఉద్దేశించిన మాంసానికి వర్తించని ఛార్జీలతో సహా, రిటైల్ మాంసం విక్రేతల నుండి అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆమ్జద్ ఉల్లాఖాన్ కు తెలియజేశారు. వధశాల పనితీరులో పారదర్శకత లోపించిందని వారు ఫిర్యాదు చేశారు మరియు సంబంధిత అధికారులకు పదేపదే చేసిన విజ్ఞప్తులు ఎటువంటి సానుకూల ఫలితాలను ఇవ్వలేదని ఆరోపించారు. వధశాల ప్రాంగణంలో ప్రాథమిక సౌకర్యాలు సరిపోకపోవడంపై కూడా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి.

పదేపదే ఫిర్యాదులు చేసినప్పటికీ నీటి సరఫరా, మురుగునీటి పారుదల, మురుగునీటి కనెక్షన్ మరియు వర్షపు నీటి నిల్వకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాలేదని సంఘం పేర్కొంది. ఈ సమస్యలను నిరంతరం నిర్లక్ష్యం చేయడం వల్ల ఆరోగ్య ప్రమాదాలు ఏర్పడి, వ్యాపారులు మరియు కార్మికుల పని పరిస్థితులు మరింత దిగజారవచ్చని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు మరియు సేవా ప్రదాత తగిన మౌలిక సదుపాయాలను అందించడంలో విఫలమవడం వల్ల చాలా మంది వ్యాపారులు తమ సొంత ఖర్చుతో తాత్కాలిక స్టాల్స్‌ను నిర్మించుకోవలసి వచ్చిందని వాటాదారులు ఆరోపించారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు వేధింపులకు గురవుతున్నారనే ఆరోపణలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను విన్న అనంతరం శ్రీ ఆమ్జద్ ఉల్లాఖాన్ మాట్లాడుతూ..

భాగస్వాములు లేవనెత్తిన ఆందోళనలు తీవ్రమైనవని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), పశువైద్య శాఖ, ఇతర సంబంధిత అధికారులు తక్షణమే వీటిపై దృష్టి సారించాలని అన్నారు. ప్రజా మౌలిక సదుపాయాల ఆధునీకరణ భాగస్వాముల పరిస్థితులను మెరుగుపరచాలని, దశాబ్దాలుగా వధశాల ద్వారా జీవనోపాధి పొందుతున్న వారికి ఇబ్బందులు కలిగించకూడదని ఆయన పేర్కొన్నారు.

జీహెచ్ఎంసీ, సంబంధిత శాఖలు భాగస్వాములందరితో చర్చలు జరపాలని, వారి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించాలని, వధశాల నిర్వహణలో పారదర్శకతను పాటించాలని, ఈ సదుపాయంపై ఆధారపడిన వేలాది కుటుంబాల జీవనోపాధిని కాపాడాలని శ్రీ ఖాన్ కోరారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, బాధితులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆయన సంఘ సభ్యులకు హామీ ఇచ్చారు.

# లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో.. టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం






హైదరాబాద్, జూలై 04: 4వ లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ 2026 శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారుల పాల్గొనడంతో టోర్నమెంట్‌కు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి బ్రహ్మణి నారా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాజీ జాతీయ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్, క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లేతో కలిసి టెన్‌విక్ స్పోర్ట్స్‌ను సహ -స్థాపించిన వసంత్ భరద్వాజ్ పాల్గొన్నారు. యువ క్రీడాకారులు లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఉప్పల్ ప్రిన్సిపాల్ డా. బ్రదర్ జోసెఫ్ పసాలా, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ రెవ. బ్రదర్ ఆంథోనీ పాల్గొని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

అలాగే తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు కె. కె. మహేశ్వరి, గౌరవ కార్యదర్శి పి. నాగేందర్ రెడ్డి, సలహాదారు ప్రకాష్ రాజు, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ టేబుల్ టెన్నిస్ జట్టు మెంటర్ ఎం. దీపేష్ సింగ్ తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ ప్రతిభ, పట్టుదల, క్రీడాస్ఫూర్తి, నిష్పాక్షిక పోటీకి ప్రతీకగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

టోర్నమెంట్ నిర్వహణలో ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.టి. అజిత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైతే దీనిని మరింత సంక్షిప్తంగా లేదా పత్రికల ప్రధాన వార్త శైలిలో ఆకర్షణీయమైన శీర్షికతో కూడా సిద్ధం చేయగలను.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితోయువత ముందుకు రావాలి

## గిరిజన రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపి నాయక్




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతిదీ ఎల్బీనగర్

తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో చిత్ర లేవుట్ కమాన్ దగ్గర తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యం గోపి నాయక్ గారు కామ్రేడ్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుల్లమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అల్లూరి సీతారామరాజుపోరాట స్ఫూర్తితో యువతీ యువకులు ముందుకు వచ్చి సమాజంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని,దేశంలో కోట్లాది మంది యువతీ యువకులు చదువుకొని ఉద్యోగం ఉపాధి అవకాశాలు రాక ఆర్థిక భారంతో జీవించలేని యువకులు అనేక మంది అసాంఘిక కార్యక్రమాలు చేస్తూ సమాజను భయభ్రాంతులకు గురించి చేసే విధంగా ఉంటున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ఎన్నికలో ఇచ్చే హామీలు నెరవేర్చాలని యువతీ యువకులను ఉద్యోగాలు ఇచ్చి ఎన్నికలో ఇచ్చిన వాగ్దానాలు నిలుపుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకు గోపి నాయక్ డిమైండ్ చేశారు ఉద్యోగం లేని యువతీ యువకులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చేప్పిన ప్రభుత్వం యువతీ యువకులకు మోసాగించారాని మండిపడ్డారు. రాష్ట్రము లో ఖాళీగాఉద్యోగాలు భర్తీ చేయాలి. నిరుద్యోగ భృతి కల్పించాలని లేనిది యెడల ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడి స్తామని హెచ్చరించారు. యల్ బి నగర్ సరూర్ నగర్ హయత్ నగర్ ప్రాంతం లో ఉన్న నీరు పేద లంబాడి గిరిజనులకు ఇండ్లు ఇండ్లస్థలాలు ఇవ్వాలని వికలాంగులకు,వింతంతు, వృద్ధాప్య పిన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె శ్రీహరి నాయక్, యం శివ నాయక్,నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
05 ఆదివారం జూలై 2026.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు కురుమ జాతి పితామహుడు దొడ్డి కొమరయ్య కురుమ 80 వ వర్ధంతి సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి ఎల్బీనగర్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి జులై :4 శనివారం ఎల్బీనగర్ చౌరస్తాలో కురుమ యువ చైతన్య సమితి ఎల్బీనగర్ కమిటీ అధ్యక్షులు కాల్నే మల్లేశం కురుమ మరియు కమిటీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య కురుమ 80 వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి పూలమాలలతో ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయ బోర్డు మెంబర్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కుండే వెంకటేష్ కురుమ, ఎల్బీనగర్ నియోజకవర్గం నాయకులు సామ రంగారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కొప్పుల విఠల్ రెడ్డి, కొప్పుల నరసింహారెడ్డి, జెక్కిడి మల్లారెడ్డి విగ్రహ దాత ఆది కృష్ణయ్య కురుమ, కర్రే శంకర్ కురుమ నర్రి వెంకన్న కురుమ, మందుల సత్యం కురుమ, బాలన్ శ్రీనివాస్ కురుమ మందుల విద్యాసాగర్ కురుమ కెమిడి ఉపేందర్ కురుమ యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జ్ కేవైసీఎస్ కమిటీ సభ్యులు కుల బంధువులు హాజరై నివాళులు అర్పించడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఇరిగి అశోక్.

శనివారం (జూలై 4)ఉప్పల్లో దారుణ ఘటన జరిగింది భార్యపై అనుమానంతో దారుణంగా హత్య చేశాడు భర్త సురేష్ జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలక నగర్ లో నివాసం ఉంటున్నారు జెస్సికా. సురేష్ దంపతులు ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు ఇద్దరు భార్యాభర్తలు గత నాలుగేళ్లుగా చిలుక నగర్లో నివాసం ఉంటున్నారు వీరికి 2015 లో వివాహం జరిగింది వీరికి పదేళ్ల కూతురు కూడా ఉంది జెస్సికా పై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు సురేష్. ఇవ్వాళ కూడా భార్య భర్తలు ఇద్దరూ గొడవపడ్డారు గొడవ శృతిమించడంతో జెస్సికాను ధారణంగా హత్య చేశాడు సురేష్. ఆ తర్వాత జెస్సికా అక్కకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు

# వీర తెలంగాణ అగ్గిరవ్వ దొడ్డి కొమురయ్య.




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్
తెలంగాణ చరిత్రలో జులై 4 అతి ముఖ్యమైన రోజు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి అంకురార్పణ జరిగిన రోజు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే మహోజ్వల ఘట్టంగా భాసిల్లిన వీర తెలంగాణ పోరాటాన్ని రగిలించిన అగ్గి రవ్వ.. దొడ్డి కొమరయ్య అమరుడయిన రోజు. కొమురయ్య అమరత్వానికి నేటితో 78 ఏండ్లు నిండుతున్నాయి. దొడ్డి కొమురయ్య యాది.. వీర తెలంగాణ పోరాట స్ఫూర్తి.. నేటి తరానికీ మార్గదర్శనమై, నేడు మనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దిక్సూచియై విరాజిల్లుతున్నవి.తెలంగాణ, మరాట్వాడా ప్రాంతాలతో పాటు 3 కన్నడ జిల్లాలు కలిగిన హైదరాబాద్ సంస్థానాన్ని ఏడవ నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలిస్తున్న రోజులవి. పైన ముస్లిమ్ రాజు.. రాజుకు అండగా ఉన్న హిందూ దొరలు కలగలిసి.. హైదరాబాద్ సంస్థానంలోని అన్ని మతాల ప్రజలపై అనేక దౌర్జన్యాలను కొనసాగిస్తున్న ఫ్యూడల్ పాలన నడుస్తున్న కాలమది. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం నడుపుతున్న జాతీయ కాంగ్రెస్ నాయకత్వం.. "స్వదేశీ సంస్థానాల వ్యవహారాల్లో తలదూర్చ కూడదు" అనే నియమాన్ని పాటిస్తూ.. నిజాం రాజుకు పరోక్షంగా అండగా నిలిచింది. నాటి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడైన స్వామి రామానంద తీర్థ ఢిల్లీకి వెళ్లి, మహాత్మా గాంధీతో సమావేశమై, నిజాం రాజు ఆగడాలను వివరించి, హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలకు అండగా నిలబడాలని కోరినప్పుడు.. "స్వదేశీ రాజు నిజాంకు వ్యతిరేకంగా ఎలాంటి ఉద్యమాలు చేయకూడద'ంటూ ఆయన స్వామి రామానంద తీర్థను మందలించి ఆదేశాలు జారీ చేశాడు. ఆ నేపథ్యంలో.. గోసలు భరించలేని తెలంగాణ బిడ్డలు.. తిరుగుబాటు వైపు అడుగులు వేస్తున్నప్పుడు.. వారికి అండగా, ఆలంబనగా నిలిచిన ఏకైక శక్తి ఆంధ్ర మహాసభ. 1930లో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన జోగిపేటలో జరిగిన తొలి ఆంధ్రమహాసభతో తెలంగాణ ప్రజల సంఘటిత చైతన్యం మొదలయ్యింది. 1944లో రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్రమహాసభ నాటికి.. ఆంధ్రమహాసభ ప్రధాన నాయకులందరూ కమ్యూనిస్టు ఆదర్శాలతో ప్రభావితులై.. కమ్యూనిస్టులుగా మారారు. కొండా వెంకట రంగారెడ్డి లాంటి దొరలు ఆంధ్రమహాసభ నుంచి బయటకు వచ్చి తెలంగాణ బిడ్డల పోరాటాలను వ్యతిరేకించడం మొదలెట్టారు.ఆ విధంగా 1944 నుంచి తెలంగాణ ప్రజాపోరాటం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కొనసాగింది. అయితే... నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన కారణాన... ఆంధ్రమహాసభ పేరుతోనే కమ్యూనిస్టుపార్టీ కార్యకలాపాలు కొనసాగాయి. అలా ఎర్రజెండా నీడలో తెలంగాణ ప్రజలు చైతన్యవంతులై అటు దొరలూ, ఇటు నిజాం రాజు అకృత్యాలను ఎదుర్కొనడానికి పోరాటం మొదలుపెట్టారు. ఊరూరా, వాడవాడలా ఆంధ్ర మహాసభ శాఖలు విస్తరించాయి. ఆంధ్రమహాసభకు పల్లెజనం పెట్టిన పేరు "సంఘం". చేతులలో గుత్పలతో దొరల గుండాల దౌర్జన్యాలను ఎదుర్కొనేవారు కాబట్టి సంస్థకు మరో పేరు "గుత్పల సంఘం". ఆ సంఘానికి నాటి నల్లగొండ జిల్లా చందుర్ తాలూకా ప్రాంతంలో చుట్టుప్రక్కల గ్రామాలు ఓ మైలురాయి.తెలంగాణ ప్రజలను అరిగోసలు పెడుతున్న దొరలలో పెద్ద దొర.. జనగామ తాలుకాకు చెందిన దేశ్ ముఖ్ విసునూరు రామచంద్రా రెడ్డి. విసునూరు దేశ్ముఖ్ ఆగడాలకు వ్యతిరేకంగా సంఘం అండతో ప్రజలు తిరగబడ్డారు. జనగామ తాలుకాలోని పాలకుర్తి గ్రామంలోని చిట్యాల ఐలమ్మ పండించిన పంటను కాజేయడానికి దొర పన్నాగాలు వేసినప్పుడు.. సంఘం అండతో ఐలమ్మ దొరకు ఎదురుతిరిగింది. సంఘం నాయకులైన కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి, చకిలం యాదగిరి రావులు పాలకుర్తికి చేరుకుని సంఘం వాలంటీర్లను సమీకరించి దొర గుండాలని ఎదిరించి పొలంలోని పంటని బండ్లకు ఎక్కించుకుని ఐలమ్మ ఇంటికి చేర్చారు. తన కింద బానిసలుగా బతికిన ప్రజలు తిరగబడడంతో విసునూరు దొర ఉగ్రుడయ్యాడు. భీమిరెడ్డి నరసింహారెడ్డితో పాటు మిగతా కమ్యూనిస్టు పార్టీ నాయకులపై నిజాం పోలీసుల అండతో కేసులు బనాయించి విసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఇంత చేసినా ఐలమ్మ మాత్రం బెదరలేదు.ఐలమ్మ ఇంటికి చేరుకున్న పంట దొరకు దక్కకుండా పోయింది. దాంతో.. తన గుండాలను పురిగొల్పి సంఘం నాయకులపై దౌర్జన్యాలు కొనసాగించాడు దొర. దొర జులుం ఎదిరించే క్రమంలో,,, నల్లగొండ మునుగోడు ప్రాంతాల్లో 1946 జులై 4న.. చందురు తాలుక ప్రాంతంలో గ్రామ వీధుల్లో.. సంఘం జండాలతో ప్రజల ఊరేగింపు సాగింది. దొర గడీలో నక్కి దాక్కున్న గుండాలు ఊరేగింపుపై తుపాకులతో కాల్పులు జరుతామని బెదిరించారు. ముందు వరుసలో ఉండి.. "సంగానికి జై" అంటూ ప్రజలు నినదిస్తున్నారు,ఆ ఉద్యమంలో ముత్యాల పాపయ్య పాల్గొన్నారు, ఉద్యమం సాగుతున్న సమయంలో,,, దక్షిణ తెలంగాణలో దొడ్డి కొమురయ్య ఆ తూటాలకు నేలకొరిగి ప్రాణాలు వదిలాడు. కొమురయ్య అన్న దొడ్డి మల్లయ్య, సంఘం నాయకులు మంగలి కొండయ్య, నరసయ్యలకు తూటాలు తగిలి గాయాలయినవి. ఆగ్రహొదగ్రులైన ప్రజలు కాల్పులకు వెరవకుండా గుండాలను తరిమికొట్టి దొర గడీకి అగ్గి పెట్టి బూడిద పాలు చేశారు.

కొమురయ్య అమరత్వంతో తెలంగాణ బిడ్డల పోరాటం సాయుధ రూపు సంతరించుకున్నది. గుత్పలు వదిలేసిన ప్రజలు తుపాకులు చేత బట్టి నిజాం రాజ్యాన్ని కూల్చడానికి.. దొరల రాక్షసత్వానికి గోరీ కట్టడానికి సంసిద్ధులయ్యారు.అలా 1946 జులై 4న ఆరంభమైన వీర తెలంగాణ పోరు.. 1951 అక్టోబర్ 21 వరకు సాగింది. తొలుత నిజాంకు, భూస్వాములకూ వ్యతిరేకంగా మొదలైన తెలంగాణ బిడ్డల పోరాటం... అటు తర్వాత దొరలకు మద్దతుగా గ్రామాలలోకి దిగిన నెహ్రూ – పటేల్ సైన్యాలకు వ్యతిరేకంగా కూడా కొనసాగింది. బాంచన్ కాల్మొక్తా అంటూ బతికిన తెలంగాణ బిడ్డలు.. బరిసెలు, బందూకులూ చేతబట్టి... దొరల రాజ్యం కూల్చడానికి ఉద్యమించారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాల్లో రైతాంగపోరాటం ఉధృతంగా సాగింది.
దొరలు ఊర్లను విడిచి పరారయ్యిండ్రు. మూడు వేల గ్రామాలు విముక్తమై... గ్రామ రాజ్య కమిటీల ఆధ్వర్యంలో ప్రజారాజ్యం ఏర్పడింది.దొరల కబ్జాలో ఉన్న పది లక్షల ఎకరాల భూమి పేద రైతులకు పంచబడింది.(ఈ ఉద్యమం క్రమంలో తర్వాత దేవలమ్మ నాగారం,పీపల్ పహాడ్ లలో పేదలకు భూమి పంచడం జరిగింది) రుణ పత్రాలు రద్దయ్యాయి. వ్యవసాయ కూలీల వేతనాలు పెరిగాయి. వెట్టి చాకిరీ రద్దయింది. కుల వివక్ష,లింగ వివక్ష కట్టడి చేయబడినాయి.దేశ స్వాతంత్ర్యం తర్వాత.. ఢిల్లీ గద్దెనెక్కిన నెహ్రూ ప్రభుత్వం నిజాం రాజును సకల మర్యాదలతో అరుసుకున్నది. ఆయనకున్న ఆస్తులు, రాజభవనాలు ఆయనవేనని ప్రకటించింది. హైదరాబాద్ రాష్ట్రానికి "రాజ్ ప్రముఖ్" పదవినిచ్చి సత్కరించింది. మరోవైపు తెలంగాణ ప్రజలపై తన సైనిక చర్యను కొనసాగించింది. పటేల్ సైన్యాలు తెలంగాణ పల్లెల్లో బీభత్సం సృష్టించాయి. తెలంగాణ ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి భరించలేని డాక్టర్ జయసూర్య (సరోజినీ నాయుడు కొడుకు) నాయకత్వంలోని మేథావుల బృందం నాటి గవర్నర్ జనరల్ జే.ఎన్. చౌదరిని కలిసి... తెలంగాణ ప్రజలు కూడా భారతీయులేననీ.. వారి ఆకాంక్షలను గుర్తించి ఉద్యమకారులతో చర్చలు జరపాలని ప్రతిపాదించారు. నెహ్రూ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కర్కశంగా తిరస్కరించింది. నిజాం హయాంలో... నెత్తిన రూమీ టోపీలు ధరించి... తెలంగాణ బిడ్డలపై జులుం చెలాయించిన దొరలు... ప్రజలు తిరగబడడంతో పల్లెల నుంచి పారిపోయి, సెప్టెంబర్ 17, 1948 తర్వాత... పటేల్ సైన్యాల అండతో నెత్తిన గాంధీ టోపీ ధరించి మళ్లీ పల్లెల్లోకి అడుగుపెట్టి... తమ పాత దోపిడీ విధానాలను యథావిథిగా కొనసాగించిన వైనాన్ని తెలంగాణ బిడ్డ, ప్రముఖ రచయిత దాశరధి రంగాచార్య తన రచనల్లో (జనపథం, మోదుగుపూలు, జీవనయానం) కండ్లకు కట్టినట్టు రికార్డు చేసిండు. సామాన్య ప్రజలకున్న మతపరమైన, ప్రాంతీయ అస్తిత్వ సెంటిమెంట్లను తమ స్వార్థ రాజకీయాలకు అనుకూలంగా మలుచుకుని దుర్వినియోగ పరిచే దుష్ట రాజకీయం నేడు జాతీయస్థాయిలో.. తెలుగు రాష్ట్రాల్లోనూ నడుస్తున్నది. పాలకుల కుల మతాల కుట్రలను ఛేదిస్తూ.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా.. అసలు సమస్యలపై నికరంగా పోరాడిన చరిత్ర వీర తెలంగాణది. ప్రజా పోరాటాలు ఎలా ఉండాలో.. పాలకవర్గాల టక్కుటమార ట్రిక్కులను, విచ్చిన్నకర రాజకీయాలను ఎలా ఎదుర్కోవాలో.. దేశ ప్రజలందరికీ దిశానిర్దేశనం చేసిన ఘన చరిత్ర తెలంగాణ బిడ్డలది. ప్రజలందరూ ఐక్యమై.. తమ ఉమ్మడి హక్కుల సాధన కోసం, మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఒక్కటిగా పోరాడగలిగే గంగా – జమునా తెహజీబ్ తెలంగాణ సంస్కృతి. ప్రజల అమాయకపు సెంటిమెంటులను వాళ్ళకు వ్యతిరేకంగా సంధిస్తూ.. వారి సంక్షేమం గురించి అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోని ఈ కాలపు పాలకులు తెలంగాణ సింబల్ ఎన్నటికీ కాబోరు. నాడైనా.. నేడైనా.. ఏనాడైనా.. తెలంగాణ సింబల్స్ అంటే.. వీరతెలంగాణ పోరాట యోధులైన.. దొడ్డి కొమరయ్య, చిట్యాల ఐలమ్మ, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మగ్దూం మొహియుద్దీనులే! "అనల్ ముల్క్" (ముస్లింలందరూ ప్రభువులే) "జిల్ ఉల్ అల్లా" (నిజాం రాజు అల్లా ప్రతినిధి) అంటూ.. నిజాం రాజు తాబేదార్లు కొనసాగించిన మతోన్మాద ప్రచారాలకు లొంగకుండా ప్రజల పక్షం వహించి ప్రాణాలొడ్డిన షోయబుల్లా ఖాన్‌ను మించిన తెలంగాణ సింబల్ ఎవరు? జల్ జంగల్ జమీన్ కోసం.. దున్నేవాడికే భూమి దక్కాలంటూ.. కష్టజీవుల హక్కులు నిలబడాలంటూ.. విముక్తి కోసం పోరాడి చరిత్ర సృష్టించిన కొమురం భీం, షేక్ బందగీ, ఆనాటి మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటానికి రాజకీయ నాయకత్వం అందించిన సుందరయ్యల వారసత్వమే నేటి తెలంగాణ బిడ్డలందరిది. దొడ్డి కొమురయ్య అమరత్వపు విలువను.. వీర తెలంగాణ పోరాట స్ఫూర్తిని.. నేటి ప్రజలు పుణికిపుచ్చుకుని.. కుల, మత, ప్రాంతీయ విభజన వాదాలను పూర్వపక్షం చేస్తూ ముందుకు సాగితే.. ప్రజాకంటక శక్తుల పరాజయము, ప్రజాశ్రేణుల విజయమూ తథ్యం. వీర తెలంగాణ చరిత్రయే అందుకు ప్రబల నిదర్శనం.

హైద్రాబాద్ ఎస్టేట్ న్యూస్

## గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తిని నింపిన అల్లూరికి ఘన నివాళి గిరిజన, ప్రజా సంఘాల నాయకులు.




హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధిచిలకలూరిపేట:

గిరిజనుల్లో విప్లవ స్ఫూర్తి రగిలించేటమేకాకుండా వారిలో ఉన్న మూఢవిశ్వాసాలను తొలగింప చేసి ఉద్యమం వైపు నడిపించిన ధీరుడు అల్లూరి సీతారామరాజు అని నాయకులు కొనియాడారు. అదేవిధంగా భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు, అగ్గి పిడుగు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని నాయకులు ఉద్ఘాటించారు. రెండేళ్ల పాటు బ్రిటిషర్లకు కంటిమీద కనుకులేకుండా చేసిన సీతారామరాజు.. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణత్యాగం చేశారని నాయకులు తెలిపారు. గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం పట్టణ ములోని ఎన్నార్టీ సెంటర్ లోని అల్లూరి సీతారామ రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులునివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారన్నారని నాయకులు అన్నారు. 9వ తరగతి వరకు చదివిన అల్లూరి.. సంస్కృతం, జోతిష్యశాస్త్రం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిగా పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు. 1924 మే 7న కొయ్యూరు గ్రామ సమీపంలో ఒక ఏటి వద్ద కూర్చొని, ఒక పశువుల కాపరి ద్వారా తనున్న చోటును పోలీసులకు అల్లూరి కబురు పంపారు. ఏటి ఒడ్డున స్నానం చేస్తూ ఉండగా పోలీసులు చుట్టుముట్టి రాజునుబంధించారు. కొయ్యూరులో విడిది చేసి ఉన్న మేజర్ గుడాల్ వద్ద రాజును హాజరు పరిచారు. బందీగా ఉన్న అల్లూరి సీతారామ రాజును ఒక చెట్టుకు కట్టివేసి ఏ విచారణ లేకుండా గుడాల్ కాల్చి చంపారు. తన తల్లికి రాజు మరణ వార్తను తెలియజేయలేదు. మే 8 న రాజు దేహాన్ని ఫొటో తీయించిన తరువాత దహనం చేశారని పేర్కొన్నారు. అతని చితా భస్మాన్ని సమీపంలో ఉన్న వరాహ నదిలో కలిపారు. ఆ విధంగా కేవలం 27 ఏళ్ళ వయసులోనే సీతారామరాజు అమరవీ అమరవీరుడయ్యాడు. అల్లూరి కృష్ణదేవిపేట లో అతని సమాధి ఉందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్, గిరిజన,బిసి నాయకులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, పాలపర్తి శ్రీనివాసరావు, బి రాంబాబు నాయక్, పాలపర్తి శివ శ్రీనివాసరావు, డి.గోపీనాయక్, కంచర్ల శ్రీనివాసరావు, ఆర్ నాగు నాయక్, పి లక్ష్మీకాంత్, వి అమర్ సింగ్ నాయక్, చందవరం హరి ప్రసాద్, పాలపర్తి కోటి తో పాటు పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల జాప్యంపై సబితా అసంతృప్తి

### పేదల వైద్య సహాయానికి ఆలస్యం తగదు: సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-
మహేశ్వరం: పేదలకు వైద్య చికిత్స కోసం ప్రభుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీలో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, పేదలకు అత్యవసర వైద్య ఖర్చుల్లో సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. అయితే ప్రస్తుతం అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు సమర్పించిన మూడు నెలల్లోనే చెక్కులు అందేవని, ఇప్పుడు తొమ్మిది నుంచి పది నెలలు గడిచినా మంజూరు కావడం లేదని విమర్శించారు. వైద్య ఖర్చులకు అనుగుణంగా రావాల్సిన పూర్తి మొత్తాలు కూడా మంజూరు కావడం లేదని పేర్కొన్నారు.
అత్యవసర వైద్య చికిత్స కోసం పేదలు అప్పులు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను వేగంగా విడుదల చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారికి సకాలంలో పూర్తి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.
నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం అందేలా కృషి కొనసాగిస్తానని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరంతరం పనిచేస్తానని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, గాయకుడు, రచయిత శ్రీ గజ్జల శ్రీనివాస్ గారికి హృదయపూర్వక అభినందనలు

సేవా భావాన్ని జీవితంలో భాగంగా మలుచుకుని, గత 25 సంవత్సరాలుగా సమాజానికి తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తూ,ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీ గజ్జల శ్రీనివాస్ గారు నిజంగా అభినందనీయులు.మెగాస్టార్ శ్రీ చిరంజీవి గారు పిలుపు రక్తదానం చేయండి... ప్రాణదాతలు కండి " అనే సందేశాన్ని హృదయపూర్వకంగా స్వీకరించి వారి స్ఫూర్తితో సేవా మార్గంలో నిరంతరం ముందుకు సాగుతున్న మెగా అభిమాని శ్రీ శ్రీనివాస్ గారి నిబద్ధత, అంకితభావం ప్రశంసనీయం.సమాజ సేవ పట్ల మీకున్న అంకితభావం మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ...

శ్రీ గజ్జల శ్రీనివాస్ గారికి మెగాస్టార్ గారి తరుపున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు.

Ravanam Swami Naidu
Akhila Bharatha Chiranjeevi Yuvatha

## వైయస్ జగన్ పై ధ్వజమెత్తిన. ..

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ ఎం



అమరావతికి మద్దతుగా 2024లో ప్రజలిచ్చిన తీర్పుని జగన్ రెడ్డి అపహాస్యం చేస్తూ, అమరావతి విషయంలో వారానికి ఒకరోజు గంటలు తరబడి ప్రెస్ మీట్ లు పెట్టి అమరావతికి వ్యతిరేకం కాదు అక్కడ అవినీతికి వ్యతిరేకమని ఒకరోజు, మరో వారంలో మూడు రాజధానిలకి కట్టుబడి ఉన్నామని మా పార్టీ విధానమని మరో నాయకుడు బొత్స తో మాట్లాడేస్తారని, ఇప్పుడు అమరావతి , మావిగన్ అంటూ కొత్త డ్రామాలు మొదలు పెట్టారని మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అమరావతి ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. 2019 కి ముందు అమరావతే రాజధాని, 50,000 ఎకరాలకు తక్కువ లేకుండా ఉండాలని శాసనసభలో మద్దతు తెలిపి, ప్రజలను నమ్మించి ఎన్నికల్లో లబ్ది పొందిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి ఐదు సంవత్సరాలు కాలయాపన చేసినందుకు 2024 ఎన్నికలలో జగన్ రెడ్డి పార్టీకి 11 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా చేసినప్పటికీ ఇంకా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదని, నిత్యం వంకర బుద్ధితో మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతూ క్రిమినల్స్ ని ప్రోత్సహిస్తూ, వారిని పరామర్శిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తూ, మావిగన్ అంటూ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని నాగ జగదీష్ అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అమరావతి నిర్మాణంలో అవినీతి జరుగుతుందంటూ, ప్రపంచ బ్యాంకులకు పెట్టుబడిదారులకు మెయిల్స్ పంపిస్తూ బెదిరిస్తూ అమరావతిలో పరిశ్రమలు రాకుండా, పెట్టుబడిదారులు పెట్టుబడులు పెట్టకుండా వెనక్కి పోయే విధంగా రాష్ట్రాన్ని అల్లకల్లాలం చేయడానికి, శాంతిభద్రతలు లేవని, రాష్ట్రంలో ప్రజలకు రక్షణ లేదని కూటమి ప్రభుత్వం అరాచకం చేస్తుందని జగన్ రెడ్డి మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాల వల్లించిన చందంగా ఉందని, ఐదు సంవత్సరాలు ప్రజలకు నరకం చూపించి విధ్వాంసక పాలనతో తుగ్లక్ నిర్ణయాలు తీసుకొని, ఉద్యోగుల ప్రయోజనాలు కాపాడకుండా వారిపై అక్రమ కేసులు బనాయించి వారు దాచుకున్న డబ్బును దారి మళ్లించి దోచుకున్న విషయం ప్రజలు మర్చిపోలేదని నాగ జగదీష్ అన్నారు.

## జనసేన పార్టీ బలోపేతానికి సూచనలను పార్లమెంట్ పరిశీలకుడికి అర్జీ అందజేసిన బలిరెడ్డి అప్పారావు



అనకాపల్లిలోని విజయ రెసిడెన్సీలో శుక్రవారం నిర్వహించిన జనసేన పార్టీ నిర్మాణం, సంస్థాగత సారథ్యంపై సమాచారం సేకరణ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ బలిరెడ్డి అప్పారావు తన సహచరులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, గ్రామస్థాయి కమిటీల పటిష్ఠీకరణ, కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించడం, పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలకు సంబంధించిన పలు అంశాలతో పొందుపరిచిన అర్జీని జనసేన పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు పెండం దొరబాబుకు అందజేశారు.పార్టీని మరింత పటిష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తల అభిప్రాయాలకు అధిష్ఠానం ప్రాధాన్యత ఇవ్వడంఅభినందనీయమని బలిరెడ్డి అప్పారావు పేర్కొన్నారు.పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి సమాచారం సేకరణ కార్యక్రమాలు ఉపయోపడతాయని ఆయన అభిప్రాయం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, బలిరెడ్డి అప్పారావు సహచరులు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు....

### జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు




రెండు రోజుల జ్ఞాన జ్యోతి120 రోజుల రిఫ్రెషర్ శిక్షణా కార్యక్రమం లో భాగంగా, అనకాపల్లి జి వి ఎం సి బాలికల ఉన్నత పాఠశాల లో జరుగుతున్న శిక్షణా కార్యక్రమం నకు ముఖ్య అతిధిగా జిల్లా విద్యాశాఖధికారి అయిన గిడ్డి. అప్పారావు నాయుడు హాజరై, శిక్షణార్థులకు జ్ఞానజ్యోతి 120రోజుల కార్యక్రమం నకు సంబందించిన వివిధ అంశాలను , పాఠశాలలో మరియు అంగన్వాడీ సెంటర్ లలో అవలంభించాల్సిన అంశాలను వివరించారు. శుక్రవారం మొత్తం 58మందికి గాను 54మంది అనకాపల్లి హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో ఏ ఎం ఓ కె. కేజియా, ఆర్ పి రాజ్ కిరణ్ , కె ఆర్ పి లు, శిక్షణార్డులు పాల్గొన్నారు.అనకాపల్లి జిల్లా లో నక్కపల్లి జడ్పీహెచ్ఎస్ స్కూల్, నర్సీపట్నం జెడ్ పీ హెచ్ ఎస్ మెయిన్ స్కూల్స్ లో శిక్షణా కార్యక్రమం జరుగుతున్నది.

## బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలు జూలైలోపు పూర్తి చేయాలి

### లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 4:-

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ గృహాల పనులను వేగవంతం చేసి జూలై నెలాఖరులోపు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పీ. గౌతం అధికారులను ఆదేశించారు.

శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని మల్లాపూర్‌లో నిర్మాణంలో ఉన్న 1,548 ఇళ్లు, కుర్మల్‌గూడలోని 1,536 ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి, నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలతో పాటు మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల పనులను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఇళ్ల కేటాయింపులో లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హులకే ప్రయోజనం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అంతకుముందు రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్‌దేవులపల్లి, లక్ష్మీగూడ ప్రాంతాలను కూడా ఆయన సందర్శించారు. లక్ష్మీగూడలోని రాజీవ్ గృహకల్ప, వాంబే కాలనీల్లో నివాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వాంబే కాలనీలో నీటి కనెక్షన్లు ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా లేకపోవడంపై స్థానికులు ఫిర్యాదు చేయగా, వాటర్ వర్క్స్ అధికారులతో వెంటనే మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే హౌసింగ్ బోర్డుకు చెందిన ఖాళీ భూములను కూడా పరిశీలించారు.ఈ పర్యటనలో హౌసింగ్ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయకుమార్, జిల్లా పీడీ డి. చాంప్లా నాయక్, ఈఈ నర్సయ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ ఎన్యూమరేషన్ గడువు పెంచాలి

### – జన చైతన్య వేదిక





గుంటూరు
4 - 07 - 2026

భారత ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితాకు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమం లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లో చేపట్టిన ఓటర్ ఎన్యూమరేషన్ కు మరో నెల గడువు పొడిగించాలని జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ శాసనమండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. లక్ష్మణరావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మేలుకో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రమేష్ పట్నాయక్, అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ వి. సురేష్, రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ కు విజ్ఞప్తి చేశారు. రమేష్ పట్నాయక్ ప్రసంగిస్తూ ఓటర్ల జాబితాకు ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఇప్పటి వరకూ 6.5 కోట్ల మంది ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించినారన్నారు. నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు మిగిలిన రాష్ట్రాలలో సర్ కార్యక్రమం ప్రారంభమైందని ఎన్యూమరేషన్ కు జులై 14 చివరి తేదీగా ప్రకటించారని 100 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను నింపటానికి మరో నెల గడువు ఇవ్వాలని కోరారు. శాసనమండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ భారత రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా భారత ఎన్నికల సంఘం సర్ కార్యక్రమాన్ని చేపట్టిందని తద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా నుండి అన్ని ఓట్లు తొలగించి, నూతన ఓటర్ల జాబితాకు రూపకల్పన జరుగుతుందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటును కాపాడుకోవడానికి తగిన కృషి చేయాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లోని రాజకీయ పార్టీలన్నీ ప్రతి బూత్ పరిధిలో ఏజెంట్లను నియమించి అర్హులైన ఓటర్లను నమోదు చేసే ప్రక్రియకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజల ఓట్లు కాపాడటానికి కృషి చేయాలన్నారు. త్వరలో రాష్ట్ర చీఫ్ ఎలక్ట్రో ఆఫీసర్ వివేక్ యాదవ్ ను పౌర సంస్థల ప్రతినిధులు సచివాలయంలో కలిసి ఓటర్ ఎన్యూమరేషన్ కు మరో నెల పెంచమని కోరుతామని తెలిపారు. ఈ సందర్భంగా మేలుకో ఆంధ్రప్రదేశ్ రూపొందించిన సర్ వాలంటీర్ గైడ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ నేత వి. సురేష్ ప్రసంగిస్తూ సర్ కార్యక్రమం ఫలితంగా దాదాపు 16.5 కోట్ల ఓటర్ల పేర్లు ఓటర్ల జాబితా నుండి దేశవ్యాప్తంగా తొలగించబడతాయని ప్రధానంగా పేదవర్గాలు, నిరాక్షరాస్యులు, వలస కార్మికులు, మైనార్టీ వర్గాల ఓట్లు గణనీయంగా తొలగించే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేయూత ఫౌండేషన్ సలహాదారులు పి. వీరారెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, మానవత సభ్యులు నారాయణరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## మానవత్వాన్ని చాటుకున్న కలెక్టర్ విజయ కృష్ణన్





విధి నిర్వహణలోనే కాకుండా మానవత్వంలోనూ ఆదర్శంగా నిలుస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరోసారి తన సున్నిత మనసును చాటుకున్నారు.శుక్రవారం మాడుగులలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న సందర్భంగా, బంగారుమెట్ట వద్ద రహదారి పక్కన కురుస్తున్న వర్షంలో బస్సు కోసం వేచి చూస్తున్న పలువురు విద్యార్థులను కలెక్టర్ గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి వారి వివరాలు తెలుసుకుని, వారిని తన కారులో ఎక్కించుకుని బంగారుమెట్ట జంక్షన్ నుంచి చిన్నప్పనపాలెం వరకు సురక్షితంగా దింపించారు.విద్యార్థులు వర్షంలో ఇబ్బంది పడకుండా వెంటనే స్పందించి వారికి లిఫ్ట్ ఇవ్వడం అక్కడి స్థానికులను ఆకట్టుకుంది. కలెక్టర్ చూపిన మానవత్వం, బాధ్యతాయుతమైన స్పందనకు స్థానికులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జోనల్ సమావేశం...




ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా శాఖ అనకాపల్లి జోన్ పరిధిలో గల అచ్చుతాపురం మునగపాక అనకాపల్లి కసింకోట పరవాడ సబ్బవరం మండల శాఖ అధ్యక్షులు కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిలర్లు జిల్లా సబ్ కమిటీ సభ్యులు ముఖ్య కార్యకర్తలతో స్థానిక కోలపర్తి అప్పారావు ఉపాధ్యాయ భవనం(ఎ. పి. టి. ఎఫ్. భవనం )నందు జోనల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశ అధ్యక్షులు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు వై శ్రీనివాసరావు, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి వెంకటపతి రాజు , రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరన త్రినాధ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ దుర్గాప్రసాద్ , సబ్ కమిటీ సభ్యులు ఎన్. సన్యాసినాయుడు, గణపతి మరియు ఫెడరేషన్ అభిమానులు పాల్గొన్నారు సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాల బైపరేషన్ వల్ల అనేక మంది జూనియర్ ఉపాధ్యాయులు ముఖ్యంగా 2018 నుండి 2025 వరకు గల వివిధ డీఎస్సీలకు చెందిన ఉపాధ్యాయులు జోన్ వన్ నుండి జోన్ రెండు కు బదిలీపై వెళ్లవలసినటువంటి తప్పని పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుంది అంతేగాక పూర్వపు ఉమ్మడి జిల్లాలో స్థానికతను ఆధారంగా చేసుకుని, సీనియారిటీ ఆధారం గా జిల్లాల పునర్విభజన జరుగుతున్నదని అందువలన ఉపాధ్యాయులు ఆప్షన్స్ ఇచ్చినప్పుడు వారి మొదటి ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని ఆయా స్థానాల్లో విధులు నిర్వర్తించేందుకు అవకాశం కల్పించాలని కోరారు కార్యదర్శి శ్రీ బి వెంకట మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడికి న్యాయం జరిగే విధంగా జిల్లా పునర్విభజనలో అవకాశం కల్పించాలని అవసరమైతే డ్రాఫ్ట్ నిబంధనలు సడలించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాధ్ మాట్లాడుతూ అవసరమైతే సూపర్ న్యూ మరీ పోస్టులు క్రియేట్ చేసైన ఉపాధ్యాయులందరికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రతి ఒక్కరికి న్యాయం జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేను పక్కా తెలుగువాడిని: శ్రీమాన్



తమిళ సినిమా పరిశ్రమలో వందలాది చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో తనదైన ముద్ర వేసుకున్న నటుడు శ్రీమాన్. ఇప్పుడు తన మాతృభాష అయిన తెలుగులో ఆయన నేరుగా సినిమా చేస్తున్నారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న కామెడీ చిత్రంలో ఒక వారం షూటింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీమాన్ తన ఎక్స్ ఖాతాలో భావోద్వేగంతో కూడిన పోస్ట్ చేశారు. "భగవంతుడికి ధన్యవాదాలు. అనిల్ గారికి థ్యాంక్స్. ఒక వారం షూటింగ్ పూర్తయింది. నా మాతృభాషలో నటిస్తున్నాననే విషయం నమ్మలేకపోతున్నా. సెట్ మీద పాజిటివ్ ఎనర్జీ, కామెడీ రోలర్ కోస్టర్.. అద్భుతమైన టీమ్‌తో పని చేయడం ఆశీర్వాదం" అని రాశారు. తాను తూర్పు గోదావరి జిల్లా గొల్లల మామిడాడకు చెందిన తెలుగు అబ్బాయినని... కానీ, తెలుగు సినిమాల్లో తన పేరు సరిగ్గా గుర్తింపుకు రాలేదని శ్రీమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఎయిర్‌పోర్టులో, రైల్వే స్టేషన్లలో తెలుగు ప్రేక్షకులు నన్ను గుర్తుపడతారు, పొగిడేస్తారు. కానీ చివరికి 'మీ పేరేమిటి సార్?' అని అడుగుతారు. ఇన్ని సినిమాలు చేసినా నా పేరు ఇక్కడ రిజిస్టర్ కాలేదు" అని భావోద్వేగం వ్యక్తం చేశారు.

అనిల్ రావిపూడి సినిమాలంటే తనకు ఎప్పటినుంచో ఇష్టమని, ఈ అవకాశం కోసం కొన్ని తమిళ సినిమాలను కూడా పక్కన పెట్టి వచ్చానని శ్రీమాన్ తెలిపారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్, కీర్తి సురేశ్‌లతో కలిసి పని చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు 'శ్రీమాన్ ఒక తెలుగు వ్యక్తి' అని పూర్తిగా తెలిసిపోతుందని ఆయన ధీమాగా చెప్పారు. శ్రీమాన్ అసలు పేరు కుమారావత శ్రీనివాసరెడ్డి కావడం గమనార్హం. ఆయన తండ్రి ప్రకాశ్ రెడ్డి నిర్మాతగా పలు చిత్రాలు నిర్మించారు.

## సినిమా వాళ్లకు అదొక పెద్ద జబ్బు: రామ్ గోపాల్ వర్మ



కథల ఎంపికలో నేటి తరం దర్శకులు, రచయితలు అనుసరిస్తున్న తీరుపై సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. చిత్ర పరిశ్రమలోని సృజనాత్మకత ఏ స్థాయికి పడిపోయిందో వివరిస్తూ ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ప్రస్తుతం చిత్రసీమ ఒక విచిత్రమైన మానసిక రోగంతో బాధపడుతోందని వర్మ వ్యాఖ్యానించారు. మేకర్స్ తమకు నచ్చిన వైవిధ్యమైన కథలను నమ్మి సినిమాలు తీయడం ఎప్పుడో పక్కనబెట్టేశారని ఆరోపించారు. జనాలు థియేటర్లలో ఏం చూడాలనుకుంటున్నారో ముందే ఊహించుకుని, దానికి తగ్గట్టు రొటీన్ కథలను వండటమే ఇండస్ట్రీకి అతిపెద్ద శాపమని దుయ్యబట్టారు. బాక్సాఫీస్ వసూళ్లు, మార్కెట్ లెక్కల కోసమే నేటి తరం నిర్మాతలు, దర్శకులు పరిగెడుతున్నారని... ఈ వ్యాపార ధోరణి వల్ల సినిమాల్లో సహజత్వం పూర్తిగా లోపించిందని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకుల నాడి పట్టుకుంటామనే భ్రమలో... కథకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఫైట్లు, డ్యూయెట్లు, రొటీన్ లవ్ ట్రాక్‌ల వంటి కమర్షియల్ హంగులను బలవంతంగా చొప్పించి సినిమా అసలు ఉద్దేశాన్నే పాడుచేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.

## ఇన్‌స్టాగ్రామ్ ఎంట్రీ ఇస్తున్న నందమూరి హీరో.. రేపు తొలి పోస్టు!



నందమూరి హీరో కల్యాణ్ రామ్ సోషల్ మీడియాలోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటివరకు ఇన్‌స్టాగ్రామ్‌కు దూరంగా ఉన్న ఆయన, తన పుట్టినరోజు సందర్భంగా జులై 5న అధికారికంగా ఈ ప్లాట్‌ఫామ్‌లో చేరనున్నారు. ఈ విషయాన్ని ఆయన బృందం అధికారికంగా ప్రకటించింది. రేపు (ఆదివారం) ఉదయం 10:11 గంటలకు ఒక ప్రత్యేక పోస్ట్‌తో ఆయన ఇన్‌స్టా ప్రయాణం మొదలవుతుంది. అభిమానులతో మరింత దగ్గరగా మమేకమయ్యేందుకు, తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను పంచుకునేందుకు కల్యాణ్ రామ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా అప్‌డేట్స్, షూటింగ్ విశేషాలు, తెర వెనుక సంగతులను ఇకపై తన ఇన్‌స్టా ఖాతా ద్వారా పంచుకోనున్నారు. ఈ వార్తతో నందమూరి అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. తమ అభిమాన హీరోకు ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం కల్యాణ్ రామ్ కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉన్నారు. విక్టరీ వెంకటేశ్ తో కలిసి ఓ భారీ మల్టీస్టారర్ చిత్రంలో నటిస్తున్నారు. స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, సురేశ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# రెండు సర్జరీలు చేశారు.. కోలుకోవడానికి 16 నెలలు పట్టింది: అఖిల్



తన కెరీర్‌లో మూడేళ్ల గ్యాప్ రావడంపై హీరో అక్కినేని అఖిల్ స్పందించాడు. "'ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు బాత్రూమ్‌లో ప్రమాదవశాత్తూ జారి పడ్డాను. గాజు ముక్కలు గుచ్చుకుని నా ఎడమ చేయి తీవ్రంగా గాయపడింది. ఆ ఘోర ప్రమాదం వల్ల ఎడమ చేతి వేళ్లకు రెండు మేజర్ మైక్రో సర్జరీలు చేయాల్సి వచ్చింది. ఏకంగా 48 కుట్లు పడ్డాయి. గాయం తీవ్రత కారణంగా కనీసం ఎనిమిది నెలల పాటు బరువులు కూడా ఎత్తలేకపోయాను. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా పూర్తిగా కోలుకోవడానికి దాదాపు 16 నెలల సమయం పట్టింది. అందుకే మూడేళ్ల పాటు కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాలేకపోయాను" అని తెలిపాడు. ఈ గ్యాప్ వల్ల అభిమానులు అసంతృప్తిగా ఉన్నారనే విషయం తనకు తెలుసని అఖిల్ చెప్పాడు. అయితే, ఇకపై కెరీర్‌లో ఇలాంటి విరామాలు రాకుండా చూసుకుంటానని తెలిపాడు. అఖిల్ తాజా చిత్రం 'లెనిన్' ఈనె 10న విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న చీకటి రోజులను గుర్తుచేసుకున్నారు. మరోవైపు, మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న 'లెనిన్' చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం ప్రేక్షకులను మెప్పిస్తుందని, ఘన విజయం సాధిస్తుందని అఖిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# లోకేశ్ కనగరాజ్ సినిమాలో ఛాన్స్ కొట్టేసిన రెజీనా!





కోలీవుడ్‌లో హిట్ డైరెక్టర్‌గా గుర్తింపు సాధించిన లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నిర్మాతగా మరో కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్నారు. 'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ', 'లియో' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో దర్శకుడిగా సత్తా చాటిన లోకేశ్... హీరోగా 'డీసీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఆయన నిర్మాతగా ఓ లేడీ ఓరియెంటెడ్ చిత్రానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. విశాల్ వెంకట్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటించబోతోందట. స్క్రిప్ట్ వర్క్ ఇప్పటికే పూర్తయిందని, సినిమా షూటింగ్ కూడా త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని చెబుతున్నారు. లోకేశ్ కనగరాజ్ 'డీసీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ, తన తదుపరి ప్రాజెక్టులపై కూడా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. డైరెక్టర్‌గా, హీరోగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా సినిమా ఇండస్ట్రీలో తన ముద్ర వేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. ఈ లేడీ ఓరియెంటెడ్ చిత్రం ద్వారా రెజీనా కసాండ్రా మరో మంచి అవకాశం కొట్టేసిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీలీల మనసు గెలవాలంటే..

## ఆ మూడు క్వాలిటీస్ ఉండాల్సిందేనట



తెలుగు సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో వేగంగా స్టార్‌డమ్‌ను అందుకున్న హీరోయిన్ శ్రీలీల మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలతో వార్తల్లో నిలిచింది. తెలుగు సినీ పరిశ్రమలో తన అందం, అభినయంతో వేగంగా స్టార్‌డమ్‌ను అందుకున్న హీరోయిన్ శ్రీలీల మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలతో వార్తల్లో నిలిచింది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, అప్పుడప్పుడు అభిమానులతో తన ఆలోచనలను పంచుకుంటూ ఉంటుంది. ఆ ఆలోచనలు అనుకోకుండా సోషల్ మీడియాలో మంచి చర్చకు దారితీస్తుంటాయి. తాజాగా రిలేషన్‌షిప్, ఫ్యూచర్ లైఫ్ పార్టనర్ గురించి ఆమె చెప్పిన మాటలు వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ సందర్భంగా శ్రీలీలను రిలేషన్‌షిప్‌పై మీ అభిప్రాయం ఏమిటి? మీకు కాబోయే జీవిత భాగస్వామిలో ఎలాంటి లక్షణాలు ఉండాలని భావిస్తారు? అని ప్రశ్నించగా, ఆమె తన సమాధానాన్ని చాలా సింపుల్‌గానే, క్లారిటీగా చెప్పింది. తాను ఒక సెన్సిబుల్, సెన్సిటివ్ అలాగే మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న వ్యక్తిని కోరుకుంటానని చెప్పింది. శ్రీలీల చెప్పిన ఈ మూడు క్వాలిటీస్ లో మొదటిది సెన్సిబిలిటీ. జీవితంలో ప్రతి పరిస్థితిని ఆలోచించి డెసిషన్స్ తీసుకునే పరిపక్వత ఉన్న వ్యక్తి కావాలని ఆమె అభిప్రాయం వ్యక్తం చేసింది. కేవలం ఎమోషన్స్ తో కాకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించే వ్యక్తిత్వానికి ఆమె ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే రెండో ముఖ్యమైన లక్షణంగా సెన్సిటివ్ నేచర్ గురించి మాట్లాడింది. ఎదుటివారి భావాలను గౌరవించడం, వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం, అవసరమైనప్పుడు మానసికంగా అండగా నిలవడం వంటి లక్షణాలు ఒక బలమైన బంధానికి ఎంతో అవసరమని ఆమె అభిప్రాయంలో ప్రతిబింబించింది. ఇక మూడో అంశంగా మంచి సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉండాలని చెప్పడం కూడా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. లైఫ్ లో ఎంత ప్రెజర్ ఉన్నా, నవ్విస్తూ పాజిటివ్ వాతావరణాన్ని సృష్టించగల వ్యక్తి ఉంటే రిలేషన్‌షిప్ మరింత అందంగా ఉంటుందని ఆమె మాటల్లో అర్థమవుతోంది. శ్రీలీల సమాధానం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఇదిలా ఉండగా, గత కొంతకాలంగా శ్రీలీల పర్సనల్ లైఫ్ పై పలు రకాల ప్రచారాలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బాలీవుడ్ యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్‌తో ఆమె రిలేషన్‌లో ఉందంటూ తరచూ కథనాలు వస్తున్నప్పటికీ, వాటికి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. అందువల్ల అవి కేవలం ఊహాగానాలుగానే కొనసాగుతున్నాయి. ఇక కెరీర్ పరంగా చూస్తే గతంలో పలు పెద్ద సినిమాల్లో నటించిన శ్రీలీల, ప్రస్తుతం బాలీవుడ్‌లో కూడా అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన పరిధిని విస్తరించుకుంటోంది. ఈ నేపథ్యంలో రిలేషన్‌షిప్ గురించి ఆమె వెల్లడించిన అభిప్రాయాలు అభిమానుల్లో మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. ప్రేమ, పెళ్లి విషయంలో రూపం లేదా హోదా కంటే వ్యక్తిత్వం, పరస్పర గౌరవం, సంతోషంగా జీవించే స్వభావానికే ఆమె ఎక్కువ విలువ ఇస్తోందనే సందేశాన్ని ఆమె మాటలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.







